సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 6 । జనవరి । 2023



ఖందేవ్ పూజకు వేళాయె

నార్నూర్‌లోని ఖాందేశ్ క్షేత్రంలో 15 రోజుల పాటు జాతర నిర్వహించనున్నారు. ఆలయంలో నేటి నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. 8లో▸



సబ్‌సెంటర్లు పూర్తయ్యేదెన్నడో?

దహెగాం మండలంలో ఏడు సబ్‌సెంటర్ల నిర్మాణ పనులు ప్రారంభించినా ఇప్పటికీ పూర్తికాలేదు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరయ్యాయి. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 /13.1

ఆకాశం చాలావరకు మేఘావృతమౌతుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయి. చలి తీవ్రత పెరుగుతుంది. ఏజెన్సీలో చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు సైన్స్ అధ్యాపకులకు శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న సైన్స్ అధ్యాపకులకు శుక్రవారం ఎంసెట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఐఈవో ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ఉచిత ఎంసెట్ శిక్షణ అందించేందుకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టుల అధ్యాపకులకు జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు అధ్యాపకులను రిలీవ్ చేయాలని ఆదేశించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట గురువారం కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల అమలు, బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని మూడు రోజులపాటు రిలే దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సమావేశానికి జిల్లాకు ఒకరు చొప్పున హాజరుకానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్మికులు బాలేశ్, లింగయ్య, గౌతం, సాగర్, విఠల్, గౌరయ్య, శ్రీకాంత్, మహేశ్, రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బీజేపీ కార్యకర్తల విస్తృత సమావేశం



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్‌అర్బన్: క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా ఈ నెల 7న ఉదయం 10 గంటలకు కార్యకర్తలు, నాయకులతో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్‌గా సమావేశమవుతారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసిఫాబాద్‌లోని ప్రేమలా గార్డెన్, కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు జయరాజ్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, మండల అధ్యక్షుడు గణేష్, నాయకులు తిరుపతి, రాంబాబు, కార్తీక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి విధి



విద్యార్థులకు పక్షుల గురించి వివరిస్తున్న ఎఫ్‌డీవో విజయ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: అటవీ సంరక్షణ ప్రజలందరి విధి అని ఎఫ్‌డీవో విజయ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ అటవీరేంజ్ పరిధిలోని వేంపల్లి టింబర్ డిపో ఆవరణలో వనదర్శిని కార్యక్రమంలో భాగంగా గురువారం జాతీయ పక్షుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వివిధ రకాల పక్షుల గురించి వివరించారు. డివిజన్ పరిధిలో సంచరించే పక్షులకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఫారెస్టు రేంజ్ అధికారి వేణుగోపాల్, సెక్షన్ అధికారి పోశెట్టి, బీట్ అధికారులు సతీశ్, బానయ్య తదితరులు పాల్గొన్నారు.

21,04,367



- ఇదీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓటర్ల సంఖ్య
- పది నియోజకవర్గాల్లో భారీగా పెరుగుదల
- కొత్తగా చేరింది 71,528, తొలగించింది 27,707మంది
- 18నుంచి 19ఏళ్ల ఓటర్లు 27,717మంది

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. స్పెషల్ సమ్మరి రివిజన్(ఎస్ఎస్ఆర్) 2022 పేరుతో రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో గత జనవరి నుంచి నవంబర్ వరకు మార్పులు, చేర్పులు చేసింది. అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత తుది జాబితాను గురువారం విడుదల చేసింది. ఈ వివరాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 21,04,367 మంది ఓటర్లు ఉన్నారు. గతంతో పోలిస్తే ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. పది నియోజకవర్గాల్లో మొత్తం 71,528మంది ఓటర్లను చేర్చగా, 27,707మందిని తొలగించారు. ఇక అత్యధికంగా ఓటర్లు ఉన్న నియోజకవర్గం మంచిర్యాల కాగా, అత్యల్పంగా బెల్లంపల్లిలో ఉన్నారు. అత్యధికంగా పోలింగ్ కేంద్రాలు 311 ముథోల్‌లో ఉండగా, అతి తక్కువగా బెల్లంపల్లిలో 222 కేంద్రాలు ఉన్నాయి. ఇక అత్యధికంగా పురుష, మహిళా ఓటర్లు మంచిర్యాలలో ఉండగా, బెల్లంపల్లిలో అత్యల్పంగా ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు బోథ్‌లో ఇద్దరు ఉండగా, ముథోల్‌లో 27మంది ఉన్నారు. 18నుంచి 19ఏళ్ల మధ్య చేర్చిన కొత్త ఓటర్లు 27,715మంది ఉన్నారు. అత్యధికంగా ఆసిఫాబాద్ పరిధిలో 9,421మంది ఓటర్లు చేరగా, అత్యల్పంగా బెల్లంపల్లిలో 2,911మంది చేరారు. మరణించిన, వేరే ప్రాంతానికి వెళ్లిన తదితర కారణాలతో తొలగించిన ఓటర్లను పరిశీలిస్తే.. నిర్మల్‌లో అత్యధికంగా 5,105మంది ఉండగా, అత్యల్పంగా మంచిర్యాలలో 889మంది ఓటర్లను తొలగించారు. ఇందులో అత్యధికంగా బోథ్‌లో ఉండగా, అత్యల్పంగా బెల్లంపల్లిలో ఉన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లోపు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఓటరు జాబితా అత్యంత కీలకంగా మారనుంది.

బోగస్ ఓటర్లకు చెక్

బోగస్ ఓటర్ల ఏరివేతకు 'ఫొటో సిమిలర్ ఎంట్రీస్' విధానం అవలంబించారు. గత ఏప్రిల్‌లో రెండేసి చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారిని అధికారులు గుర్తించారు. బూత్‌స్థాయిలో బీఎల్‌వోలు సర్వే చేపట్టారు. ప్రతీ ఓటరు ఫొటో ఆన్‌లైన్‌లో ఉండడంతో కొత్తగా ప్రవేశపెట్టిన సాంకేతిక పరిజ్ఞానంతో రెండు చోట్ల ఉంటే తొలగించారు. డిసెంబర్‌లో గడప గడపకు సర్వే నిర్వహించి కొత్త వారిని ఓటరు జాబితాలో చేర్చారు.

మహిళలే అధికం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు. ఖానాపూర్(ఎస్టీ), ఆదిలాబాద్, బోథ్(ఎస్టీ), నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు.

కుమురంభీం జిల్లాలో 4,20,216 మంది

ఆసిఫాబాద్: కుమురంభీం జిల్లాలోని 584 పోలింగ్ కేంద్రాల పరిధిలో 4,20,216 మంది ఓటర్లు ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 2,07,906 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,04,107 పురుషులు, 1,03,785 మంది స్త్రీలు, 14 మంది థర్డ్‌జెండర్లు ఉన్నారు. 9421 మంది కొత్త ఓటర్లను చేర్చగా, 2828 మందిని జాబితా నుంచి తొలగించారు. 18 ఏళ్లు నిండిన యువ ఓటర్లు 3,082 మందికి ఓటు హక్కు కల్పించారు. సిర్పూర్ నియోజకవర్గంలో 283 పోలింగ్ కేంద్రాల్లో 2,12,310 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,06,970 మంది పురుషులు, 1,05,333 మంది స్త్రీలు, ఏడుగురు థర్డ్‌జెండర్లు ఉన్నారు. 9,259 మందిని కొత్తగా చేర్చగా, 2,579 మందిని తొలగించారు. 18 ఏళ్లు నిండిన 2,910 మంది యువ ఓటర్లకు కొత్తగా ఓటుహక్కు కల్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 3,58,608 మంది ఓటర్లు ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 1,84,444 మంది ఓటర్లు, సిర్పూర్ నియోజకవర్గంలో 1,74,164 మంది ఉన్నారు. గతేడాది ఏప్రిల్‌లో జిల్లాలో 16,585 మంది రెండు చోట్ల ఓటుహక్కు కలిగి ఉన్నట్లు అధికారులు తేల్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బీఎల్‌వోలు ఇంటింటికీ తిరుగుతూ వివరాలు ధ్రువీకరించారు. ఆ తర్వాత ఎన్నికల సంఘం కొత్తగా ప్రవేశపెట్టిన 'ఫొటో సిమిలర్ ఎంట్రీస్' విధానంతో జిల్లాలోని బోగస్ ఓట్లను తొలగించారు. డిసెంబర్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సిబ్బందితో గడపగడపకూ సర్వే నిర్వహించి కొత్తవారిని జాబితాలో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	18-19ఏళ్ల ఓటర్లు	మొత్తం ఓటర్లు
సిర్పూర్	283	1,06,970	1,05,333	7	2,910	2,12,310
చెన్నూర్(ఎస్సీ)	225	88,497	87,947	11	1,692	1,76,455
బెల్లంపల్లి(ఎస్సీ)	222	80,894	80,341	14	1,222	1,61,249
మంచిర్యాల	279	1,24,769	1,24,193	20	1,696	2,48,982
ఆసిఫాబాద్(ఎస్టీ)	301	1,04,107	1,03,785	14	3,082	2,07,906
ఖానాపూర్(ఎస్టీ)	305	1,01,201	1,04,537	13	2,812	2,05,751
ఆదిలాబాద్	281	1,11,039	1,14,016	7	3,055	2,25,062
బోథ్(ఎస్టీ)	301	98,456	1,02,576	2	3,885	2,01,034
నిర్మల్	302	1,10,538	1,22,696	14	3,601	2,33,248
ముథోల్	311	1,13,251	1,19,092	27	3,760	2,32,370

అభివృద్ధిలో ముందుండాలి



డీపీఆర్‌వో కృష్ణమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్‌అర్బన్: అభివృద్ధిలో జిల్లా ముందుండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అధికార యంత్రాంగం కృషి అభినందనీయమని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. కొత్త ఏడాదిలో జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి కార్యాచరణను రూపొందించుకుని, లక్ష్యాలు సాధించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండోస్థానం, ఆరోగ్యంలో ప్రథమ స్థానం, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఉత్తమ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో మొదటి సిజేరియన్ ప్రసవం చేయడంలో వైద్యారోగ్యశాఖ కృషి అభినందనీయమన్నారు. ప్రత్యామ్నాయ పంటలు, చిరుధాన్యాలు సాగుచేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. విషజ్వరాల వ్యాప్తిని తగ్గించడంలో అధికారులు దృష్టి సాధించడం తృప్తినిచ్చిందన్నారు. గర్భిణులు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు విని యోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులకు జ్ఞాపికలు అందజేశారు. రాజస్వ మండల అధికారి రాజేశ్వర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వసతులు కల్పించాలని మంచిర్యాల గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి టీం సభ్యులు రామంజనేయ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యమందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వామి, నర్సింగ్ సూపరింటెండెంట్ వందన, జిల్లా క్వాలిటీ మేనేజర్ శ్రీసాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- అందుబాటులోకి కొత్త సూపర్ లగ్జరీ

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోకు మంజూరైన సూపర్ లగ్జరీ బస్సును గురువారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డిపో మేనేజర్ శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం నూతన బస్సులో పట్టణంలో కాసేపు ప్రయాణించారు. కళాకారులు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రభుత్వం ఆసిఫాబాద్ డిపోకు బస్సు మంజూరు చేసిందని తెలిపారు. ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, నాయకులు గోపాల్‌నాయక్, ఇరుకుల మంగ, ఎంఎఫ్ మధుసూదన్, అసిస్టెంట్ మేనేజర్ విశ్వనాథ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ ఉదయ్, ఉద్యోగులు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

'కాగజ్‌నగర్'కు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

- ప్రదానం చేసిన మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షణ్‌- 2022 దక్షిణ భారత స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో ఉత్తర, దక్షిణ జోన్లలో అతివేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో (మున్సిపాలిటీల్లో) 50వేల నుంచి లక్ష జనాభా గల కేటగిరీలో కాగజ్‌నగర్ బల్దియాకు ఈ అవార్డు దక్కింది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య అవార్డు స్వీకరించారు. మున్సిపాలిటీలో శానిటేషన్, పబ్లిక్ టాయిలెట్స్, డంపింగ్ యార్డుల నిర్వహణ, క్రమం తప్పకుండా వార్డుల నుంచి చెత్త సేకరణ, ఎఫ్ఎస్‌టీపీ నిర్వహణ తదితర అంశాలపై అధ్యయనం చేసి అవార్డుకు ఎంపిక చేశారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి అవార్డు రావడంపై పాలకవర్గ సభ్యులు, పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు.



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

రాష్ట్రంలో బహుజన రాజ్యం రావాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సిర్పూర్(టి): బడుగు, బలహీన వర్గాల సమస్యలు పరిష్కారం కావాలంటే రాష్ట్రంలో బహుజన రాజ్యం రావాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా గురువారం సిర్పూర్(టి) మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవడం లేదని, రోడ్డు సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం బీసీ కులగణన చేయకుండా రిజర్వేషన్లు పెంచకుండా మోసం చేస్తుందని, టీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను ప్రవేశపెట్టాల్సి వస్తోందని శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడం ఆరోపించారు. ధరణి పోర్టల్ కేవలం భూములు కబ్జాలు చేసేందుకే ఉపయోగపడుతుందని ఎద్దేవా చేశారు. ఉపాధ్యాయులపై దాడులకు దిగిన సంఘ్ పరివార్, వీహెచ్‌పీ సంఘాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలలో అనారోగ్యంతో మృతి చెందిన చింతకుంట గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి సంగీత కుటుంబ సభ్యులను పరామర్శించారు. విద్యార్థి మృతిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి, బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జక్కాపూర్, మాకిడి, బస్టాండ్ ఏరియా, గోవింద్‌పూర్ ఎస్సీ కాలనీల్లో పర్యటించారు. స్థానికులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, నాయకులు రాంప్రసాద్, షేక్ చాంద్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఐదేళ్ల తర్వాత దర్బార్!

- సమస్యల పరిష్కార వేదికగా జంగుబాయి పుణ్యక్షేత్రం
- హాజరు కానున్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- అమ్మవారి సన్నిధిలో నేడు మహాపూజ



ఎడ్లబండ్లపై ఆలయానికి వస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు గుహ వద్ద బారులుతీరిన భక్తులు

కెరమెరి(ఆసిఫాబాద్): జంగుబాయి అమ్మవారి మహాపూజకు వేళయింది.. సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించుకునేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్నిఏర్పాట్లు పూర్తిచేశారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో కెరమెరి మండలంలోని మహరాజ్‌గూడ అటవీప్రాంతంలో కొలువైన ఆదివాసీల ఆరాధ్య దైవం జంగుబాయి అమ్మవారి ఆలయంలో శుక్రవారం మహాపూజ అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఆ తర్వాత దర్బార్ నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఐదేళ్ల తర్వాత దర్బార్ నిర్వహిస్తుండటంతో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు దారి చూపుతారని భక్తులు భావిస్తున్నారు.

ఐదేళ్లుగా అధికారిక కార్యక్రమాలు బంద్..

2017 డిసెంబర్ 21 జంగుబాయి ఆలయంలో అధికారికంగా దర్బార్ నిర్వహించారు. అప్పటి కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరై ఆదివాసీలకు పలు హామీలు ఇచ్చారు. ఐదేళ్లుగా ఇక్కడ ఎలాంటి అధికారిక కార్యక్రమాలు నిర్వహించడం లేదు. తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఐటీడీఏ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినా పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు. రెండేళ్లుగా కరోనా మహమ్మారి కారణంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదు. ఆంక్షల మధ్య అమ్మవారికి పూజలు చేశారు. ఈ ఏడాది ఆంక్షలు లేకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. మరోసారి ఆలయంతోపాటు ఆదివాసీల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు దర్బార్‌ను వినియోగించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయించారు.

కలెక్టర్లు, ప్రముఖులకు ఆహ్వానం..

మహాపూజకు హాజరు కావాలని కుమురంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆదిలాబాద్ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో పాటు పలువురు ప్రముఖులను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్‌చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, రేఖానాయక్, జోగు రామన్న, రాథోడ్ బాపూరావ్, మాజీ ఎంపీ గోడాం నగేశ్ హాజరు కానున్నారు. అలాగే రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కూడా వచ్చే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

ప్రధాన సమస్యలు

- అమ్మవారి ఆలయం పేరిట పట్టాలు చేసి ఇవ్వాలి.
- జంగుబాయి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించాలి.
- వంతెన నుంచి ఆలయం వరకు సీసీ లేదా బీటీరోడ్డు వేయాలి.
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.
- ప్రత్యేకంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలి.
- మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించాలి.
- కటోడాలకు నివాస గృహాలు ఏర్పాటు చేయాలి.

మహాపూజకు ఏర్పాట్లు



జంగుబాయి ఆలయ సన్నిధిలో శుక్రవారం నిర్వహించే మహాపూజకు అన్ని ఏర్పాట్లు చేశాం. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితోపాటు ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు, ఎమ్మెల్యేలను ఆహ్వానించాం. భక్తులకు తాత్కాలిక రవాణా సదుపాయం కల్పించాం.

– కొడప జాకు, ఆలయ కమిటీ చైర్మన్

సమస్యలు పరిష్కరించాలి



ఐదేళ్ల తర్వాత నిర్వహించే దర్బార్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారు. నేటి దర్బార్‌లో సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నారు. ఏళ్లుగా అనేక సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయాయి.

– మరప బాజీరావు, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు

క్లుప్తంగా

8న జిల్లాస్థాయి చెస్ పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని మిమ్స్ పాఠశాలలో ఈ నెల 8న జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజర్ మహేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 9491532651 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

పాత మంచిర్యాల: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీని గురువారం సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నేరేళ్ల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా నీలి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా యాదబోయిన రాజన్న, రమణాచారి, కోశాధికారిగా గడికొప్పుల శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా బోనగిరి రాజారెడ్డి, రాజేశం, జిల్లా అధికార ప్రతినిధిగా శ్రీనివాస్, ఆర్గనైజర్లు, ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు.

తహసీల్దార్ ఎదుట ఐదుగురి బైండోవర్

చింతలమానెపల్లి(సిర్పూర్): అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులను గురువారం తహసీల్దార్ ముస్కూర్ అలీ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. సిర్పూర్(టి) మండలానికి చెందిన అశోక్ మండల్, కోర్సిని గ్రామానికి చెందిన దండిక మహేశ్, లంబాడిహెట్టికి చెందిన అజ్మీర మంగీలాల్, లావుడే బాలు, కౌటాల మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన నరులే ప్రదీప్ అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అటవీశాఖ అధికారులు గమనించి పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలుశిక్ష


మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో గతేడాది జరిగిన మూడు చోరీ కేసుల్లో ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ రెండో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సుమన్ గ్రేవెల్ గురువారం తీర్పు ఇచ్చినట్లు సీఐ నారాయణ్‌నాయక్ తెలిపారు. 2022 మార్చి 3న పద్మశాలి కాలనీలో కమల్‌సింగ్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని, జూన్ 6న ఎడ్లవాడలోని సాయికృష్ణకు చెందిన బైక్‌ను పెద్దపల్లికి చెందిన నెడునూరి శ్రావణ్, ఆగస్టు 18న స్థానిక బీట్ మార్కెట్ సమీపంలో పార్కింగ్ చేసి ఉంచిన ట్రాక్టర్‌ను హుజూరాబాద్‌కు చెందిన గోసుకుల కనకయ్య దొంగిలించినట్లు ఆధారాలతో సహా అప్పటి ఎస్సై అంజన్న కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో నిందితులకు 6నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

చంపుతానని బెదిరించిన కుమారుడిపై కేసు

కాగజ్‌నగర్ రూరల్: తండ్రిని చంపుతానని బెదిరించిన కుమారుడిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.8 గ్రామానికి చెందిన ప్రతాప్ హల్దార్ గన్నారం గ్రామశివారులోని తన నాలుగెకరాల పంటపొలంలో కూతురు మనిషా, అల్లుడు రూప్‌చంద్‌తో కలిసి వరి పంట సాగు చేశాడు. అయితే ప్రతాప్ హల్దార్‌కు తెలియకుండా చిన్న కుమారుడు దేవమిత్ర హల్దార్ పొలంలోని వడ్ల బస్తాలను అమ్ముకున్నాడు. మిగిలిన బస్తాలను తీసుకెళ్లేందుకు గురువారం మనీషా పొలం వద్దకు వెళ్లగా దేవమిత్ర హల్దార్ దాడి చేసి గాయపర్చాడు. ఈ విషయమై అడిగేందుకు వెళ్లిన తండ్రిని అసభ్యకరంగా దూషించడంతో పాటు చంపుతానని బెదిరించాడు. ప్రతాప్ హల్దార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖందేవ్ పూజకు వేళాయె

- నేటి నుంచి పుజా కార్యక్రమాలు
- ఆలయంలో నెలకొన్న ఆధ్యాతిక శోభ
- ఇతర రాష్ట్రాల నుంచి రానున్న తొడసం వంశస్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ సభ్యులు
- 15రోజుల పాటు కొనసాగనున్న జాతర


నార్నూర్‌లోని ఖందేవ్ ఆలయం


మాన్యాపూర్‌లో నువ్వుల నూనె తయారు చేస్తున్న గిరిజనులు

నార్నూర్: 11వ దశాబ్దం పూర్వం మండల కేంద్రంలో వెలసిన ఆదిమ గిరిజన తొడసం వంశస్తుల ఆరాధ్య దైవం ఖందేవ్ క్షేత్రానికి ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఆదిమ గిరిజన తొడసం వంశస్తులు మూడు రోజుల ముందు నుంచి ఆలయ అలంకరణతో పాటు జాతర ఏర్పాట్లు చేపడతున్నారు. ఈ జాతరకు స్వరాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి తొడసం వంశస్తులు చేరుకుంటారు. వారి ఆచార, సంస్కృతి, సంప్రదాయం ప్రకారం ఖందేవుడికి పుష్య పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఖందేవ్ ఆలయం సన్నిధిలో మండలంలోని ఖైర్‌డట్వా గ్రామం తొడసం వంశానికి చెందిన ఆడ పడుచు (కడోద్, గిత్తకు చెందిన) ఇంటి నుంచి సేకరించిన కిలో నువ్వుల నూనె తాగి తమ మొక్కును తీర్చుకుంటుంది.

జాతర వివరాలు..
5న మాన్యాపూర్ వద్ద మసాయి దేవతకు తొడసం వంశస్తుల పూజలు
6న ఖందేవ్‌కు మహాపూజ
7న నూనె తాగనున్న ఆడపడుచు, ప్రజాదర్బార్

నువ్వుల నూనెతో సంప్రదాయ మొక్కు..

పుష్య పౌర్ణమి మరుసటి రోజు ఉదయం దేవుడి సన్నిధిలో తొడసం వంశానికి చెందిన ఆడపడుచు రెండు కిలోల నువ్వుల నూనె తాగడం ఆనవాయితి. మూడు సంవత్సరాలు ఒక్కరే నూనె తాగాల్సి ఉంటుంది. మండలంలోని చిత్తగూడ గ్రామానికి చెందిన ఆడపడుచు మాడవి యోత్మబాయి మూడుసార్లు నువ్వుల నూనె తాగి మొక్కును తీర్చుకుంది. ఈసారి కడోద, గోత్తికి చెందిన తొడసం ఆడపడుచు నువ్వుల నూనె తాగనుంది. ఈ నూనె తాగడంతో సంతాన యోగం కలుగుతుందని, ఆరోగ్య సమస్యలు తొలుగుతాయని వారి నమ్మకం.


ఆలయంలోని పులి విగ్రహం

ప్రజా దర్బార్..

తొడసం వంశస్తుల మహాపూజ, సంప్రదాయ మొక్కులు చెల్లించిన అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తొడసం వంశస్తులు సంప్రదాయ భేటి నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధితో పాటు సంస్కృతి, సంప్రదాయల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు. యువకులతో పాటు వంశస్తులకు తొడసం వంశ పెద్దలు హిత బోధ చేస్తారు. అనంతరం ఆలయం ఆవరణలో మినీ ప్రజా దర్బార్‌ను నిర్వహించి సమస్యలను వివరిస్తారు.

'తొడసం' విజయానికి చిహ్నంగా ఏనుగు


ఆలయంలో ఏర్పాటు చేసిన ఏనుగు విగ్రహం

ధృవరాజులు పాలనలో ఏనుగులను యుద్ధం సమయంలో ఉపయోగించేవారు. రాజ్యానికి సంబంధించిన ఏనుగులు ప్రజలకు సంబంధించిన పంటలను ధ్వంసం చేయడంతో పాటు ప్రజలపై దాడులకు పాల్పడుతుండేవి. ఏనుగులను పట్టుకోవడానికి ధ్రువ రాజులు బహుమతి ప్రకటన చేశారు. అప్పటి చంద్రపూర్ కేంద్రంగా గోండ్వానా రాజ్యాన్ని ఆత్రం వంశానికి చెందిన రాజులు పరిపాలిస్తుండేవారు. తొడసం వంశస్తులు ప్రస్తుతం గాదిగూడ మండలంలోని రోమన్‌కాసా (అప్పటి గోండ్వానా రాజ్యంలోని ఎనికాసా) గ్రామం వద్ద ఏనుగులు నిద్రపోతున్న సమయంలో పట్టుకుని ఖందేవ్ పుణ్య క్షేత్రం సమీపంలో చింతచెట్టు వద్ద కట్టివేశారు. దీంతో ఆత్రం వంశానికి చెందిన రాజు సవ్వ చాలీస్ రాజ్యాన్ని తొడసం వంశానికి అప్పగించారు. దీంతో అప్పటి నుంచి తొడసం వంశానికి ఏనుగును విజయ చిహ్నంగా భావిస్తున్నట్లు ఆ వంశ పెద్దలు తొడసం బాపురావు, తొడసం రాజు తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి



తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడాలి. నియమనిష్టలతో ఖందేవుడికి పూజలు చేయడం జరుగుతుంది. భారత దేశంలో ఎక్కడ ఉన్నా తొడసం వంశస్తులు ఏడాదికోసారి ఇక్కడికి రావాల్సిందే. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటాం. – తొడసం రాజు పటేల్, తొడసం వంశం పెద్ద

ఆనవాయితీగా వస్తుంది..



మా తాతముత్తాల కాలం నుంచి మా వంశ దేవుడు ఖందేవుడికి పుష్య పౌర్ణమి సందర్భంగా పూజలు చేస్తాం. దేశం నలుమూలల నుంచి తొడసం వంశస్తులు ఇక్కడికి చేరుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. మా సంస్కృతి, సంప్రదాయం ప్రకారం పూజలు చేస్తాం. ఈ నెల 7న ప్రజాదర్బార్‌ను విజయవంతం చేయాలి. – తొడసం నాగోరావు, తొడసం వంశస్తుడు, ఆలయ కమిటీ సభ్యుడు

భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు



తొడసం వంశానికి చెందిన ఖందేవుడి పూజ కోసం అందరి సహకారంతో అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగింది. ఏటా పుష్య పౌర్ణమి సందర్భంగా ఆనవాయితి ప్రకారం పూజలు చేస్తాం. తొడసం వంశానికి చెందిన ఆడ పడుచు నువ్వులు నూనె తాగి మొక్కు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జాతరకు వచ్చే భక్తులు కరోనా నిబంధనలు పాటించాలి. – మేస్రం రూప్‌దేవ్, ఖందేవ్ ఆలయ కమిటీ చైర్మన్, నార్నూర్

ఉద్యోగాల పేరిట మోసగించిన వ్యక్తికి దేహశుద్ధి


ఉద్యోగాలిప్పిస్తానని మోసం చేసిన ఉద్యోగి

మందమర్రిరూరల్ (చెన్నూర్): సింగరేణిలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా ఉద్యోగం ఇప్పిస్తామని, క్లర్క్ పోస్టుకు ఎంపిక చేస్తామని లక్షల్లో వసూలు చేసిన సెక్యూరిటీ ఉద్యోగి మహేష్‌కు గురువారం బాధితులు దేహశుద్ధి చేశారు. సింగరేణి సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న మహేష్ ఎనిమిది నెలల క్రితం ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నమ్మబలికి పలువురి వద్ద రూ.30 లక్షల వరకు వసూలు చేశాడు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం రాకపోయేసరికి మోసపోయామని గ్రహించిన బాధితులు సింగరేణి అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం బాధితులతో పాటు ఉద్యోగి కూడా ఎస్అండ్ పీసీ ఆఫీస్‌లో విచారణకు హాజరయ్యాడు. సదరు ఉద్యోగి బాధితులను గుర్తు పట్టనట్టు ప్రవర్తించాడు. అసలు వాళ్లెవరో తనకు తెలియదని చెప్పి కార్యాలయ ఆవరణ నుంచి బయటకు వెళ్లాడు. దీంతో కోపోద్రిక్తులైన బాధితులు అతనికి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా అనవసరంగా నలుగురు వ్యక్తులు తనపై దాడి చేశారని ఉద్యోగి కోల మహేష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రెండో ఎస్సై మహేందర్ తెలిపారు.

ప్రమోషన్ పత్రాలు అందజేత

జైపూర్(చెన్నూర్): మండలంలోని ఇందారం ఐకే 1ఏ గని, ఐకే–ఓసీపీ గనిలో పనిచేస్తున్న ఉద్యోగులకు గురువారం ప్రమోషన్ పత్రాలు అందజేశారు. ఐకే1ఏ గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఐకే1 గనిలో పనిచేస్తున్న 21మందికి, ఐకే–ఓసీపీలో పనిచేస్తున్న 20 మంది ఉద్యోగులకు శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా సర్వీస్ లింక్డ్ ప్రమోషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐకే1ఏ, ఐకే–ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఎం.శ్రీనివాస్, గని మేనేజర్ రవికుమార్, ఆపరేషన్స్ మేనేజర్ బ్రహ్మాజీరావు, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి గడ్డం మల్లన్న, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'స్కూల్ బస్సులకు టోల్‌ట్యాక్స్ మినహాయించాలి'

మంచిర్యాలఅర్బన్: మందమర్రి వద్ద ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా వద్ద ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులకు ట్యాక్స్ మినహాయింపు ఇవ్వాలని కోరుతూ గురువారం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నేతృత్వంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను కలిసి విన్నవించారు. 20 కిలోమీటర్ల పరిధిలోని పాఠశాల బస్సులు లోకల్ పరిధిలోకి వస్తాయని, అలాంటి అన్నిరకాల వాహనాలకు టోల్ మినహాయింపు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. మంచిర్యాల, మందమర్రి నుంచి రోజుకు సుమారు 50 విద్యాసంస్థల బస్సులు టోల్‌ప్లాజా అవతల ఉన్న గ్రామాల విద్యార్థులకు విద్యనందిస్తున్నాయన్నారు. విద్యాసంస్థలకు నడిచే బస్సులు కమర్షియల్ వెహికల్ కిందకు రావన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్, ఉపాధ్యక్షుడు కస్తూరి పద్మచరణ్, నాయకులు సిద్దయ్య, సంజీవరెడ్డి, రాంవేణు, మాధవన్, తిరుపతిరెడ్డి, విక్రమ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


బాల్క సుమన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గర్భిణిపై హత్యాయత్నం

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- భర్త, అత్తామామలపై కేసు నమోదు

సిర్పూర్(టి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను ఆరునెలలైనా గడవకముందే హతమార్చేందుకు కుట్రపన్నిన సంఘటన మండలంలోని కేశవపట్నంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కౌటాల సీఐ స్వామి, సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేశ్ గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేశవపట్నం గ్రామానికి చెందిన దుర్కె కవిత, కోట మహేందర్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అప్పటికే కవిత గర్భిణి. ప్రేమ పెళ్లి ఇష్టం లేని మహేందర్ ఆమెను హత్య చేసేందుకు కుట్రపన్నాడు. గతనెల 29న కవిత తల్లిగారింట్లో ఒంటరిగా ఉండగా అత్త విమల, మామ లహోడి, భర్త మహేందర్ పురుగుల మందు కలిపిన జ్యూస్ తాగించారు. కొద్దిసేపటికి రక్కం కక్కుకుని కిందపడిపోవడంతో కుటుంబ సభ్యులు ముందుగా కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాల పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. డిసెంబరు 30న ఆడబిడ్డకు జన్మనివ్వగా శిశువు మరణించింది. బాధితురాలి తండ్రి దుర్కె పెంటు ఫిర్యాదు మేరకు భర్త మహేందర్, అత్తామామలు విమల, లహోనుపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ స్వామి, ఎస్సై రమేశ్

'మహాసభలు విజయవంతం చేయాలి'

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ స్టేడియంలో ఈ నెల 8 న నిర్వహించనున్న సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ 10వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.బ్రహ్మానందం పిలుపునిచ్చారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని సివిల్ డిపార్టుమెంట్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు, హక్కుల సాధన కోసం మూడు దశాబ్దాలుగా రాజీలేని పోరా టం చేస్తున్నామన్నారు. యూనియన్ పోరాటాల ఫలితంగానే సింగరేణిలో మొదటిసారిగా జీ వో అమలులోకి వచ్చిందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై జరుగుతున్న పోరాటంలో భాగంగా రీజియన్ నాయకత్వాన్ని పటిష్ట పరిచేందుకు మహాసభలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పోశం, శ్రీనివాస్, సికిందర్, పోసుబాయి, బాపు, రాణి, భీమేష్, స్వామి, సావిత్రి పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రానికి చెందిన వేముల కావేరి గురువారం సాయంత్రం గాంధీచౌక్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనకనుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఘటనలో మహిళకు గాయాలు కావడంతో ముందుగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు. బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తి పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'19 శాతం వేతనాల పెంపు మరెక్కడా లేదు'

శ్రీరాంపూర్(మంచిర్యాల): 11వ వేతన ఒప్పందంలో పెరిగిన 19 శాతం వేతనాలు పెంపు దేశంలో మరే పరిశ్రమల్లో లేదని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కె బాజీసైదా, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన వేతన ఒప్పందంలో 19 శాతం వేతనాలు పెరుగుతున్నాయన్నారు. మిగిలిన అలవెన్సులపై కూడా మెరుగైన ఒప్పందం చేసుకువస్తామన్నారు. అవగాహన లేని కొన్ని సంఘాలు వేతన ఒప్పందాన్ని తప్పుపడుతున్నారన్నారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచి సెక్రటరీలు కొట్టె కిషన్‌రావు, ఎం.కొమురయ్య, నాయకులు మురళీచౌదరీ, నర్సింగరావు, రాయలింగు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బొగ్గు గని కార్మికుల ఘన విజయం

కాసిపేట(బెల్లంపల్లి): 11వ వేజ్‌బోర్డులో ఎంజీఎస్ 19 శాతం సాధించడం బొగ్గు గని కార్మికుల విజయమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎండి అక్బర్ అలీ అన్నారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, జాతీయ సంఘాల ఐక్యతతో 11వ వేజ్‌బోర్డు సాధించామన్నారు. సమావేశంలో బెల్లంపల్లి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, కార్యదర్శి దాగం మల్లేశ్, నాయకులు ఇప్పకాయల లింగయ్య, పులి శంకర్, కొత్తపల్లి నర్సయ్య, బొద్దుల వెంకటేశ్, తీర్థాల చంద్రయ్య, నీలయ్య, కుమార్ బాబు, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

'కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'

మందమర్రిరూరల్(చెన్నూర్): కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వివిధ కార్మికసంఘాల ఆధ్వర్యంలో గురువారం జీఎం కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష చేపట్టారు. హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ దీక్షను ప్రారంభించారు. కాంట్రాక్టర్ చనిపోయాడన్న నెపంతో కార్మికులను విధుల్లోకి తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కొత్త కాంట్రాక్టర్‌కు టెండర్ ఇచ్చేంత వరకు వేరే కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో విధులకు పురమాయించాలన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, హెచ్‌ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వెల్దిసుదర్శన్, కాంట్రాక్ట్ కార్మికులు కూర్చున్నారు.

శాలివాహన పవర్‌ప్లాంట్ మూసివేతకు కుట్ర

- సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి

పాత మంచిర్యాల: రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న ఉద్దేశంతోనే శాలివాహన గ్రీన్‌ఎనర్జీ పవర్‌ప్లాంట్ మూసివేతకు కుట్ర జరుగుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి ఆరోపించారు. ప్లాంటు ఎదుట కార్మికులు బుధవారం చేపట్టిన దీక్ష రెండో రోజుకు చేరుకుంది. గురువారం దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్‌ప్లాంట్ ఏర్పాటు సమయంలో ఆ ప్రాంత రైతుల నుంచి సంస్థ యాజమాన్యం చాల తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసిందని, ప్రస్తుతం భూముల విలువ పెరగడంతో ప్లాంట్ మూసివేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా కోట్ల రూపాయలు గడించాలని యాజమాన్యం కుట్రలు చేస్తోందన్నారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లోపాయికారి ఒప్పందం ఉందన్నారు. అందులో భాగంగానే పవర్‌ప్లాంట్‌కు ఉత్పత్తికి కావాల్సిన అనుమతులు ఇవ్వడంలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికార యంత్రాంగం జోక్యం చేసుకుని కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి పరిశ్రమ తెరిపించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, నాయకులు ప్రేంకుమార్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.


దీక్షకు మద్దతు తెలుపుతున్న సీపీఎం నాయకులు

వృద్ధుడి ఆత్మహత్య

దండేపల్లి(మంచిర్యాల): అనారోగ్యంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మాదాపూర్‌లో చోటు చేసుకున్నట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. మాదాపూర్‌కు చెందిన దోమ అనంతరావు (75) ఇటీవల మంచంపై నుంచి కిందపడడంతో చాతిలో దెబ్బతాకడంతో ఎలాంటి ఆహారం తీసుకోలేకపోతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన అనంతరావు ఈ నెల 4న ఇంట్లో ఎవరూలేని సమయంలో టాయిలెట్ క్లీనర్ (హార్పిక్) తాగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా లక్సెట్టిపేటకు, అక్కడినుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుని భార్య యేసుమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని రిటైర్డ్ కార్మికుడు బలవన్మరణం

రామకృష్ణాపూర్(చెన్నూర్): ఉరేసుకుని రిటైర్డ్ కార్మికుడు బలవన్మరణం చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ కాలనీకి చెందిన ఇప్ప వెంకటి(72) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మానసిక స్థితి కూడా సరిగా లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. గురువారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఇంటి బయట ఉండగా తన గదిలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఫరీద్ తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన చెప్పిడే రాఘవులు(40) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన రాఘవులు కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గతనెల 25న మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

దండేపల్లి(మంచిర్యాల): ప్రమాదవశాత్తు బావిలోప డి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని మాదాపూర్‌లో చోటు చేసుకున్నట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. గ్రామానికి చెందిన మచ్చ మల్లవ్వ (85) ఈ నెల 4న ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు రాత్రి వరకూ వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం తమ పెరట్లో ఉన్న వ్యవసాయ బావిలో చూడగా మృతదేహం కనిపించింది. మృతురాలికి వృద్ధాప్యం పైబడడంతో కళ్లు సరిగా కనిపించడం లేదు. అటువైపుగా వెళ్లడంతో ప్రమాదవశాత్తు బావిలో జారి పడింది. మృతురాలి కుమారుడు ఆశన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి ...

దండేపల్లి(మంచిర్యాల): ఈ నెల 3న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని నంబాలకు చెందిన విద్యార్థి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. గ్రామానికి చెందిన పెట్టెం శివకృష్ణ (21) లక్సెట్టిపేటలోని ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు సక్రమంగా వెళ్లకపోవడంతో వారంరోజుల క్రితం తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన శివకృష్ణ ఈ నెల 3న ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డిమందు తాగాడు. ఇంతలో బయటికి వెళ్లిన తండ్రి ఇంటికి వచ్చేసరికి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. వెంటనే ముందుగా లక్సెట్టిపేటలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

హాజరు ఇలా.. తరగతులు నడిచేదెలా?

దండేపల్లి(మంచిర్యాల): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాజరుశాతం రోజురోజుకూ తగ్గుతోంది. కేవలం పరీక్షల సమయంలో తప్ప మిగతారోజుల్లో అంతంతమాత్రంగానే ఉంటోంది. దీంతో క్లాసుల నిర్వహణ సక్రమంగా కొనసాగడంలేదు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల సంఖ్య 231. కానీ గురువారం హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులో 45 మంది విద్యార్థులకు కేవలం నలుగురు, ఎంపీసీ, బైపీసీలో 55 మంది విద్యార్థులకు ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. కళాశాలకు పక్కాభవనం, వసతుల లేమి కారణమా? లేక మరేమైనా కారణాలు ఉన్నాయా? అనే దానిపై సదరు అధ్యాపకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కళాశాల సిబ్బంది కూడా విధులకు హాజరు కావడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ శోభను సంప్రదించగా విద్యార్థుల హాజరు శాతం తగ్గుతున్న మాట వాస్తవమేనన్నారు. కళాశాలకు రాని విద్యార్థులకు అధ్యాపకులతో ఫోన్ చేయించినా స్పందించడం లేదన్నారు. సిబ్బంది విషయాన్ని ప్రస్తావించగా అంతా బాగానే ఉందని, హాజరు శాతం పెంచేందుకు, చర్యలు చేపడతామన్నారు.


45 మందికి గానూ హాజరైన విద్యార్థులు